సాక్షి
కుమురం భీం
సోమవారం । 23 । అక్టోబర్ । 2023



గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి గ్రౌండ్‌లో బతుకమ్మ వేడుకలు

న్యూస్‌రీల్

'నో బ్రిడ్జ్.. నో ఓట్'



గ్రామస్తులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఆసిఫాబాద్‌రూరల్: 'దయచేసి ఏ పార్టీ నాయకులు గుండికి రావొద్దు' అంటూ ఆసిఫాబాద్ మండలం గుండి గ్రామస్తులు ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం చర్చనీయాంశంగా మారింది. 'నో బ్రిడ్జ్.. నో ఓట్.. నో ఎలక్షన్స్' అనే నినాదంతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ఆదివారం వైరల్‌గా మారింది. గ్రామస్తులు మాట్లాడుతూ గుండి వాగుపై వంతెన నిర్మిస్తామని హామీలు ఇవ్వడం, భూమి పూజ చేయడం తప్పితే ఇప్పటివరకు పనులు ముందుకు సాగలేదన్నారు. 17 ఏళ్లయినా వంతెన పూర్తికాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలు బహిష్కరిస్తేనే వంతెన పూర్తవుతుందని స్పష్టం చేశారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి



కవాతు చేస్తున్న ఎస్పీ, పోలీసులు

ఆసిఫాబాద్: జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించామని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం పారా మిలటరీ దళాలల ఫ్లాగ్ మార్చ్‌ను జెండా ఊపి ప్రారంభించారు. అంబేడ్కర్ చౌక్, మజీద్, బ్రాహ్మణవాడ, కసాబ్ వాడి, సందీప్‌నగర్ వీధుల గుండా కవాతు కొనసాగింది. ఎస్పీ మాట్లాడుతూ ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. 597 కేంద్రాల్లో 432 సాధారణ, 92 క్రిటికల్, 73 ఎల్‌డబ్ల్యూ కేంద్రాలు గుర్తించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటరమణ, సీఐలు రాజు, శ్రీనివాస్, నరేందర్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌక్ వద్ద పారా మిలిటరీ దళాల ఫ్లాగ్ మార్చ్‌ను ఎస్పీ సురేశ్‌కుమార్ ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు. పారా మిలిటరీ దళాలతో కలిసి పట్టణంలోని లారీ చౌక్, రాజీవ్‌గాంధీ చౌక్, మార్కెట్ ఏరియా గుండా కవాతు నిర్వహించారు. అనంతరం పారామీటర్ దళాల కోసం ఏర్పాటు చేసిన సదుపాయాలను పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ సూచనల మేరకు సిబ్బంది విధులు నిర్వహించాలని ఆదేశించారు. గొడవలు సృష్టించాలని చూసే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎస్పీ కరుణాకర్, సీఐలు స్వామి, నాగరాజు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మతో మహిళ

సద్దుల సంబురం

తీరొక్క పూలు.. ఆడబిడ్డల ఆటపాటలతో సంబురంగా సాగిన బతుకమ్మ పండుగ ఘనంగా ముగిసింది. ఆదివారం అర్ధరాత్రి దాటే వరకు జిల్లావ్యాప్తంగా సద్దుల బతుకమ్మ వేడుకలు కనుల పండువగా నిర్వహించారు. మహిళలు, యువతులు, చిన్నారులు అందంగా పేర్చిన బతుకమ్మలతో ఆనందోత్సవాల మధ్య ఆడిపాడారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, రెబ్బెనతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో సంబురాలు అంబరాన్నంటాయి. అనంతరం బతుకమ్మలను సమీపంలోని వాగులు, చెరువుల్లో నిమజ్జనం చేశారు.

– ఆసిఫాబాద్/కాగజ్‌నగర్‌టౌన్/సాక్షి నెట్‌వర్క్



జిల్లా కేంద్రంలోని శివకేశవ మందిరంలో..



కాగజ్‌నగర్ పట్టణంలో బతుకమ్మలతో మహిళలు

గెలుపు కోసం గాలం!

- ఓటర్ల కోసం వేట
- ప్రత్యర్థులకు తాయిలాల ఆశ
- అసంతృప్తులకు బుజ్జగింపులు
- పావులు కదుపుతున్న పార్టీలు

జంగ్ తెలంగాణ

సాక్షి, ఆసిఫాబాద్: జిల్లాలో రోజురోజుకూ రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. ఇప్పటికే అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడడం.. ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల జాబితా ఒక్కొక్కటిగా విడుదల అవుతుండటమే ఇందుకు కారణమైంది. గెలుపే లక్ష్యంగా జిల్లాలోని సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో అధికార బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీలు పావులు కదుపుతున్నాయి. తమ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు చేజారిపోకుండా ఓవైపు చూసుకుంటూనే.. మరోవైపు ప్రత్యర్థి పార్టీల నాయకులు, కార్యకర్తలను తమ వైపు తిప్పుకునేందుకు గాలం వేస్తున్నాయి. అలాగే ఏ పార్టీకి చెందని తటస్థులను ఆకర్షించే పనిలో నాయకులు పడ్డారు. నేరుగా ఫోన్లలో సంప్రదిస్తూ తమకు మద్దతు తెలపాలని కోరుతున్నారు.

కులసంఘాల నేతలతో బేరసారాలు..

ఎన్నికల్లో కులసంఘాల పాత్ర కీలకంగా మారిన నేపథ్యంలో అధికార, విపక్ష పార్టీల నేతలు కులసంఘాల నేతలను ప్రసన్నం చేసుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. వారిని ఎలాగోలా బుట్టలో వేసుకోవాలని చూస్తున్నారు. అవసరమైతే ఆయా నేతలతో బేరసారాలకు సైతం దిగుతున్నట్లు రాజకీయ నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా సిర్పూర్ నియోజకవర్గంలో ఈ పరిస్థితి మరీ అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇక్కడ గెలిచి తీరాలన్న పట్టుదలతో ఉన్న అధికార, విపక్ష పార్టీల నేతలు కుల, యువజన సంఘాల నేతలు, పెద్దలకు రూ.లక్షల్లో బేరం పెట్టినట్లు ఇటీవల జోరుగా ప్రచారం జరిగింది. దీంతోపాటు తాము విజయం సాధించిన తర్వాత పనులు, పదవులు కట్టబెటతామని హామీలు సైతం ఇస్తున్నట్లు సమాచారం.



ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు..

విపక్ష, అధికార పార్టీలు అన్న తేడా లేకుండా ఎన్నికల బరిలో నిలిచే పార్టీలన్నీ ఓటర్లను మచ్చిక చేసుకునే ప్రయత్నాల్లో తలమునకలయ్యాయి. అధికార పార్టీ ఇప్పటికే ఆత్మీయ సమ్మేళనాల పేరిట అన్ని మండలాల ప్రజలతో సమావేశమైంది. నెలరోజుల ముందుగానే ఆ పార్టీ అభ్యర్థులను సైతం ప్రకటించడంతో వారు అన్ని పార్టీల కంటే ముందుగా గ్రామాల్లో ప్రచారం మొదలెట్టారు. అదే సమయంలో బూత్‌స్థాయి నుంచి ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. అలాగే ప్రత్యర్థి శిబిరం నుంచి వలసలను ప్రోత్సహించేందుకు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. గ్రామాల వారీగా ఉన్న కీలక నేతలకు గాలం వేస్తూ.. మాట వినని పక్షంలో సామ, దాన, భేద, దండోపాయాలను ప్రయోగించేందుకు వెనుకాడటం లేదు. ప్రత్యర్థి పార్టీల్లోని కీలక నేతలకు భారీ ఆర్థిక ప్యాకేజీలు ఇచ్చి వారిని తమవైపు తిప్పుకుంటుండడం గమనార్హం.



ద్వితీయ శ్రేణి నాయకులకు బాధ్యతలు

అధికార, విపక్ష పార్టీల్లో అసంతృప్తిగా ఉన్న ద్వితీయ శ్రేణి నాయకులను బుజ్జగించి మరీ గెలుపు బాధ్యతలను వారి భుజస్కంధాలపై మోపుతున్నారు. ఇలా చేయడం ద్వారా బాధ్యతతో ఉంటారని ఆయా పార్టీల అభ్యర్థులు యోచిస్తున్నారు. విజయం సాధించిన వెంటనే వారికి పదవులు కట్టబెటతామని తాయిలాలు ప్రకటిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీల మద్దతు కూడగట్టడానికి ప్రయత్నిస్తున్నారు. గత ఎన్నికల్లో ప్రధానంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ల మధ్యే పోటీ జరిగింది. ఈసారి ఎన్నికల్లో బీఎస్పీ, బీజేపీపాటు ఇతర పార్టీలు కూడా బరిలో దిగుతున్న నేపథ్యంలో ఓట్లు చీలిపోయే ప్రమాదం ఉంది. ఆ ప్రమాదం జరగకూడదని అన్ని పార్టీలనేతలు సమాలోచనలు చేస్తున్నారు. తమకే ప్రయోజనం కలగాలనే రీతిలో పావులు కదుపుతున్నారు.

హరీశ్‌బాబుకు టికెట్ ఖరారు

- బీజేపీ తొలి జాబితా విడుదల
- పెండింగ్‌లోనే 'ఆసిఫాబాద్'

సాక్షి, ఆసిఫాబాద్: కొన్ని రోజులుగా ఉత్కంఠ రేపిన బీజేపీ తొలి జాబితాను ఎట్టకేలకు ఆదివారం ఆ పార్టీ అధిష్టానం అధికారికంగా ప్రకటించింది. ముందుగా ఊహించినట్లుగానే జిల్లాలోని సిర్పూర్ నియోజకవర్గ అభ్యర్థిగా ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు ఖరారయ్యారు. ఆసిఫాబాద్ నియోజకవర్గ అభ్యర్థి ఎవరన్నది ఇంకా తేలలేదు. రెండో జాబితాలో అభ్యర్థిని ప్రకటించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. వాస్తవానికి శనివారమే జాబితా ప్రకటించాల్సి ఉండగా.. మూడు సీట్ల ఖరారు విషయంలో సందిగ్ధత నెలకొనడంతో వాయిదా పడిన సంగతి తెలిసిందే. అయితే ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి మాత్రం అభ్యర్థిత్వాలు ఖరారైన వారికి స్వయంగా ఫోన్లు చేసి ఎన్నికలకు సిద్ధం కావాలని సూచించారు. ఆయా నియోజకవర్గాల్లో శనివారమే పార్టీ శ్రేణులు సంబురాలు జరుపుకొన్నారు.

బలమైన రాజకీయ నేపథ్యం..

పాల్వాయి హరీశ్‌బాబుకు బలమైన రాజకీయ కుటుంబ నేపథ్యం ఉంది. ఆయన తల్లిదండ్రులు ఇద్దరూ ఎమ్మెల్యేలుగా గెలుపొందారు.



పాల్వాయి హరీశ్‌బాబు

హరీశ్‌బాబు తండ్రి పాల్వాయి పురుషోత్తంరావు 1989, 1994లో వరుసగా రెండు సార్లు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందగా.. తల్లి రాజ్యలక్ష్మి సైతం 1999లో టీడీపీ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2004లో ఉస్మానియా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన పాల్వాయి హరీశ్‌బాబు.. ఆ తర్వాత చెన్నైలోని శ్రీరామచంద్రా యూనివర్సిటీ నుంచి ఎం.ఎస్.(ఆర్థోపెడిక్స్) చేశారు. పీడియాట్రి ఆర్థోపెడిక్ సర్జన్‌గా వైద్యవృత్తిని ప్రారంభించారు. 2017 నవంబర్‌లో రాజకీయ అరంగ్రేటం చేశారు. ప్రత్యేక రాజకీయ ఎజెండాను రూపొందించుకుని ప్రజల్లోకి వచ్చారు. మొదట 2018లో కాంగ్రెస్ పార్టీ తరఫున సిర్పూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ ఎన్నికల్లో తన సమీప ప్రత్యర్థి కోనేరు కోనప్పపై పోటీ చేసి 59,052 ఓట్లు సాధించారు. ఆ తర్వాత ఆయన బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. వివిధ వర్గాలకు మద్దతుగా పోరాటాలు చేయడంతోపాటు మారుమూల గ్రామాల్లో పాదయాత్ర చేసిన ఆయనకు నియోజకవర్గంలో మంచి పట్టుంది.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు

కాగజ్‌నగర్‌టౌన్: అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ హేమంత్ బోర్కడే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని సెయింట్ క్లారెటి పాఠశాలలో ఆదివారం ఈవీఎం, వీవీ ప్యాట్ల ర్యాండమైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో ఎన్నికల విధులు కేటాయించిన అధికారులు ఎలాంటి పొరపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సిర్పూర్ నియోజకవర్గానికి బ్యాలెట్ కంట్రోల్ యూనిట్లు 1,386, వీవీప్యాటు 410 కేటాయించినట్లు తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్కానింగ్ చేసి, బందోబస్తు మధ్య తరలిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



ర్యాండమైజేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్

అడెల్లి పోచమ్మా.. దీవించమ్మా..

- ఘనంగా ముగిసిన గంగనీళ్ల జాతర
- ఆలయానికి భారీగా వచ్చిన భక్తులు
- శోభాయాత్రగా తెచ్చిన ఆభరణాలు
- అడుగడుగునా అమ్మకు నీరాజనం
- దర్శించుకుని పులకించిన భక్తజనం

సారంగాపూర్/దిలావర్‌పూర్: భక్తులకు కొంగుబంగారంగా.. కోరిన కోర్కెలు తీర్చే అనురాగవల్లిగా.. జిల్లా ప్రజల ఇలవేల్పుగా పేరొందిన అడెల్లి మహాపోచమ్మతల్లి గంగనీళ్లజాతర ఆదివారం ఘనంగా ముగిసింది. అమ్మవారి ఆభరణాలు, గంగాజలంతో దిలావర్‌పూర్ మండలం సాంగ్వి నుంచి చేపట్టిన శోభాయాత్ర ఆదివారం అడెల్లి ఆలయానికి చేరింది. అమ్మవారికి నగలు అలంకరించిన ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో కుంకుమార్చన, పవిత్ర గంగానది జలాలతో ఆలయ శుద్ధి, అమ్మవారి విగ్రహానికి పాలాభిషేకం, అనంతరం పవిత్రోత్సవం తదితర పూజలు జరిపించారు. శనివారం రాత్రినుంచే ఆలయానికి భక్తులు రావడంతో పరిసరాలన్నీ కిటకిటలాడాయి. ఉమ్మడి ఆదిలాబాద్‌జిల్లా నలుమూలల నుంచే కాకుండా నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, మహారాష్ట్రలోని యావత్‌మాల్, నాందేడ్, చంద్రాపూర్ జిల్లాలనుంచి, మధ్యప్రదేశ్, ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని ఆయా ప్రాంతాలనుంచి భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు. ఆదివారం ఉదయం కోనేరులో పవిత్ర స్నానాలాచరించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత బీజేపీ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దిలావర్‌పూర్‌లో జరిగిన అమ్మవారి ఆభరణాల ఊరేగింపులో పాల్గొన్నారు.



పూనకాలతో ఊగిపోతున్న శివసత్తులు

గంగాజలంతో ఆభరణాల శుద్ధి

దిలావర్‌పూర్ మండలం సాంగ్వి గ్రామ గోదావరి పరీవాహక ప్రాంతం ఆదివారం తెల్లవారుజామున అశేష భక్తజనంతో పులకించింది. అడెల్లి మహాపోచమ్మ ఆభరణాల ఊరేగింపు శోభాయాత్ర శనివారం ఉదయం సారంగపూర్ మండలం అడెల్లి దేవస్థానం నుంచి మొదలై దిలావర్‌పూర్ మండలంలోని కదిలి, మాడేగాం, దిలావర్‌పూర్, బన్సపల్లి, కంజర్ గ్రామాల మీదుగా రాత్రి సాంగ్వి పోచమ్మ ఆలయానికి చేరుకుంది. అమ్మవారి ఆభరణాల వెంట వచ్చిన భక్తులు రాత్రంతా అమ్మవారి నామస్మరణతో జాగరణలో పాల్గొన్నారు. ఆటపాటలతో అమ్మవారి ఆభరణాలను ఆదివారం తెల్లవారుజామున గోదావరి తీరానికి తీసుకువెళ్లారు. స్థానిక ఊరి పెద్దలు, అమ్మవారి ఆలయ పూజారులు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, స్థానిక నాయకుల ఆధ్వర్యంలో అర్చకులు శాస్త్రోక్తంగా అమ్మవారి నగలను శుద్ధి చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవిత్ర గోదావరి జలాలను గడ ముంతల్లో తీసుకున్న భక్తులు గంగనీళ్ల జాతరకు అమ్మవారి ఆభరణాల వెంట వెళ్లారు.

కన్నుల పండువగా శోభాయాత్ర

సాంగ్వి ఆలయం నుంచి ఉదయం 6గంటలకు ప్రారంభమైన గంగనీళ్ల జాతర అడెల్లి దేవస్థానానికి తిరుగుపయనమైంది. ఈక్రమంలో కంజర్, బన్సపల్లి, దిలావర్‌పూర్, మాడేగాం, కదిలి గ్రామాల్లో స్థానిక నాయకులు అమ్మవారి ఆభరణాల శోభాయాత్రకు మేళతాళాలు, భాజాభజంత్రీలతో ఘన స్వాగతం పలికారు. దిలావర్‌పూర్ గ్రామానికి చేరుకోగానే గ్రామస్తులు జాలుక దండ (భారీపూలతోరణం)తో స్వాగతం పలకగా.. గ్రామానికి చెందిన పోతరాజులు అమ్మవారికి పూజలు నిర్వహించి జాతర ఉత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు యాటపిల్లలను (గొర్రె పొట్టేళ్లు) బహూకరించారు. శివసత్తులు పూనకాలతో ఊగిపోయారు. దారి పొడవునా అమ్మవారి ఆభరణాలపై పసుపు నీళ్లు చల్లుతూ కొబ్బరి కాయలు కొడుతూ భక్తులు మొక్కు తీర్చుకున్నారు.

రేపు జిల్లాస్థాయి యోగా పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 24న జిల్లాస్థా యి యోగా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీ ఎఫ్ జిల్లా క్రీడల ప్రధాన కార్యదర్శి సాంబశి వరావు ఆదివారం తెలిపారు. కాగజ్‌నగర్‌లోని ఫాతిమా కాన్వెంట్ స్కూల్‌లో పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అండర్– 14 విభాగంలో పాల్గొనే వారు 2010 జనవరి 1, అండర్ – 17 విభాగంలో పాల్గొనే వారు 2007 జనవరి 1 తర్వాత జన్మించి ఉండాలన్నారు. ఆసక్తి గల విద్యార్థులు బోనఫైడ్, ఆధార్‌కార్డుతో ఫాతిమా కాన్వెంట్ పాఠశాలకు రావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 97040 10779 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రైళ్ల పునరుద్ధరణ.. ప్రయాణికుల రద్దీ

- అన్నిలోకల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ప్రారంభం
- ఈ నెలాఖరులోగా అందుబాటులోకి కాజీపేట– బల్లార్షా నైట్ ప్యాసింజర్
- ప్రయాణికుల రాకపోకలతో కిటకిటలాడుతున్న ట్రైన్లు



కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ దిగి బయటకు వస్తున్న ప్రయాణికులు

కాగజ్‌నగర్‌టౌన్: చెన్నై– న్యూఢిల్లీ ప్రధాన రైల్వేలైన్‌లో ని కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో కొన్నిరోజులుగా ప్రయాణికుల రాకపోకలు గణనీయంగా పెరిగాయి. నిత్యం రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ కనిపిస్తోంది. ప్రస్తుతం బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ జన సందోహం ఉంటుంది. గత నెలలో కాజీపేట–బల్లార్షా మధ్య మూడో రైల్వే మార్గం పనులు పూర్తయిన విషయం తెలిసిందే. దీంతో మూడు నెలల క్రితం రద్దయిన అన్నిరైళ్లను ఉన్నతాధికారులు పునఃప్రారంభించారు. హైదరాబాద్ నుంచి కాగజ్‌నగర్ వరకు నడిచే రైళ్లు అందుబాటులోకి రావడంతో పండుగకు ప్రజల కష్టాలు తీరాయి. ఇంటర్ సిటీ, సికింద్రాబాద్ నుంచి కాగజ్‌నగర్ వరకు నడిచే కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్‌తోపాటు అన్నిరకాల లోకల్ ఎక్స్‌ప్రెస్‌లు పునఃప్రారంభం కావడంతో ప్రయాణికుల రాకపోకలు పెరిగాయి.

పండుగ రద్దీ..

ప్రస్తుతం పండుగ సీజన్ కావడంతో లోకల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో విపరీతంగా ప్రయాణికుల రద్దీ పెరిగింది. మరోవైపు కాజీపేట– సిర్పూర్‌టౌన్ (రామగిరి ఎక్స్‌ప్రెస్), సిర్పూర్‌టౌన్– కరీంనగర్(పుష్‌పుల్), కరీంనగర్– సిర్పూర్ టౌన్ (పుష్‌పుల్), సిర్పూర్ టౌన్–భద్రాచలం రోడ్డు(సింగరేణి ఎక్స్‌ప్రెస్), భద్రాచలం– బల్లార్షా (సింగరేణి ఎక్స్‌ప్రెస్), బల్లార్షా–కాజీపేట (రామగిరి ఎక్స్‌ప్రెస్) రైళ్లు అందుబాటులోకి వచ్చాయి. ఆయా రైళ్ల నుంచి మహారాష్ట్ర, తెలంగాణ ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. 17035– 36 (కాజీపేట– బల్లార్షా నైట్) ప్యాసింజర్ రైలును మాత్రం అధికారులు ఇంకా నడపడం లేదు. ఈనెల 29 వరకు ఈ ప్యాసింజర్‌ను రద్దు చేశారు. ఈ నెల 30 నుంచి ఆ రైలును సైతం ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో అన్ని రైళ్లు అందుబాటులోకి వచ్చినట్లు అవుతుంది.

కాగజ్‌నగర్ స్టేషన్‌లో అభివృద్ధి పనులు

మరోవైపు రైల్వే ఇంజినీరింగ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో శరవేగంగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఈ స్టేషన్‌లో ఒక ఫుట్ ఓవర్ బ్రిడ్జి (కాలినడక వంతెన) ఉండగా, మరో ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మిస్తున్నారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జికి ఆనుకుని నూతన భవన సముదాయం నిర్మాణాన్ని పూర్తి చేశారు. అందులో స్టేషన్ మాస్టర్‌తోపాటు ఇతర విభాగాల అధికారులకు బ్లాక్‌లు కేటాయించారు. పాత స్టేషన్ మాస్టర్ బ్లాక్‌ను ఖాళీ చేశారు. దాదాపు 30 ఏళ్ల నుంచి కొనసాగిన పాత ప్లాట్‌ఫాం నంబర్– 2, 3ను తొలగించారు. నూతన ప్లాట్‌ఫాం– 2, 3 నిర్మాణ పనులు 70శాతం వరకు పూర్తయ్యాయి. మూడో ప్లాట్‌ఫాంను 2గా అభివృద్ధి చేసి మూడో ప్లాట్‌ఫాంకు బదులు నూతనంగా మరో ప్లాట్‌ఫాం నిర్మాణం చేపట్టారు. అందులో షెడ్ల నిర్మాణం, సౌకర్యాల కల్పన పనులు జోరుగా సాగుతున్నాయి. స్టాళ్ల నిర్మాణం కూడా చేపడుతున్నారు.



రైల్వేస్టేషన్‌లో నూతన భవన సముదాయం

ప్రయాణికులు సహకరించాలి



తెలంగాణ– మహారాష్ట్ర సరిహద్దులోని కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో ప్రస్తుతం అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ప్రయాణికులు రైల్వే అధికారులకు సహకరించాలి. కాగజ్‌నగర్, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రాకపోకల సమయంలో రద్దీ విపరీతంగా పెరుగుతుండడంతో ప్లాట్‌ఫాంలపై వెళ్లేవారు జాగ్రత్తగా ఉండాలి. గడువులోగా నిర్మాణ పనులు పూర్తి చేస్తాం. త్వరలోనే కాజీపేట– బల్లార్షా, బల్లార్షా– కాజీపేట(నైట్ ప్యాసింజర్) రైళ్లను సైతం అందుబాటులోకి వస్తాయి.

– కైలాష్, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్, కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్

- ఎన్నికల వేళ పుంజుకోనున్న వ్యాపారాలు
- ఫ్లెక్సీలు మొదలు క్యాటరింగ్ సర్వీస్‌ల వరకు
- వంట మాస్టర్లు.. డ్రైవర్లకు చేతి నిండా పని
- పరికరాలను సిద్ధం చేసుకునే పనిలో వ్యాపారులు

ఎన్నికల 'ఉపాధి'


సౌండ్ సిస్టం సిద్ధం చేస్తున్న నిర్వాహకులు

నిర్మల్‌చైన్‌గేట్: ఎన్నికల నగారా మోగిందో లేదో రాజకీయ పార్టీల నాయకులు, అధికారులే కాదు.. ఇటు బ్యానర్ల ప్రింటింగ్ మొదలు.. వాటిని కట్టే వారి నుంచి ప్రచార రథాలు నడిపే డ్రైవర్లు.. వంట మాస్టర్లు.. క్యాటరింగ్‌లు.. హోటళ్లు.. సప్లయర్స్.. ఇలా ప్రతి ఒక్క వ్యాపారం జోరందుకుంది. దాదాపు రెండు నెలల పాటు తమ వ్యాపారాలు ఎంచక్కా సాగుతాయనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటి నుండే ఆయా రంగాలకు చెందిన వ్యాపారులు అన్ని సిద్ధం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో జోరుగా పోటీ జరుగుతుందనే ప్రచారం నేపథ్యంలో వ్యాపారులు కూడా దానికి తగ్గట్టుగానే ముందుకు సాగుతున్నారు.

సప్లయర్స్ బిజీబిజీ..

సప్లయర్స్ వ్యాపారులకు ఇప్పటి నుంచే అడ్వాన్సులు అందుతున్నాయి. టెంట్లు, వంట పాత్రలు, లైటింగ్, కుర్చీలు, మైక్ సెట్లు, స్పీకర్‌లు ఎన్నికలకు ప్రధాన అవసరం కావడంతో చివరి దశలో వాటికి కొరత ఏర్పడే అవకాశం ఉండడంతో పార్టీల వారు ఇప్పటి నుంచే అడ్వాన్సులు ఇస్తున్నారు. దీంతో ఆ వ్యాపారులు కావాల్సిన సామగ్రిని ఇతర ప్రాంతాల నుంచి తెచ్చుకుంటున్నారు. మరికొందరు ప్రత్యేకంగా సౌండ్ సిస్టంకు సంబంధించిన షాపులను ఏర్పాటు చేసుకున్నారు.

ప్రధాన వ్యాపారాలివే...

ఫ్లెక్సీలు తయారు చేయడంలో ఫొటో డిజిటల్‌కు సంబంధించిన వారికి డిమాండ్ పెరిగింది. విభిన్న డిజైన్లను తయారుచేసే పనిలో డిజిటల్ వ్యాపారులు మునిగిపోయారు. ఇక ఫ్లెక్సీల ఏర్పాటుకు ముందుగానే కాంట్రాక్టు అప్పగించేస్తున్నారు. అలాగే క్యాటరింగ్ వారికి కూడా డిమాండ్ ఉంది. రోజు ఉదయం నుంచి రాత్రి వరకు కార్యకర్తలు, నాయకులు సమావేశాలకు వచ్చే వారికి టిఫిన్లు, భోజనాలు అందించేందుకు అదనపు భారం తమపై పడకుండా ముందుగానే క్యాటరింగ్ ఇస్తుండటంతో ఆ రంగంలో ఉన్న వారు ఆర్డర్లకు సరిపడా వంట సామగ్రి కిరణం, గ్యాస్ ఏర్పాటు చేసుకుంటున్నారు.

చేతి నిండా పని..

ప్రస్తుతం ఎన్నికల ప్రచారం కూడా చేసుకునే అవకాశం ఎన్నికల కమిషన్ కల్పించడంతోఇప్పటి నుండే పలువురికి చేతి నిండా పని దొరికింది. వాహనాలు ఉన్న వారు తమ వాహనాలను ఎన్నికలు ముగిసే వరకు అద్దెకు పెట్టేందుకు ఆయా పార్టీల వారితో చర్చలు చేస్తున్నారు. వంట మాస్టర్లకు మంచి డిమాండ్ పెరిగింది. అభ్యర్థుల, పార్టీ క్యాంపు కార్యాలయాల వద్ద వంటలు చేసేందుకు మాస్టర్లను, వారికి సహాయకులను ప్యాకేజీ రూపంలో మాట్లాడుకుంటున్నారు. రూ.కోట్లల్లో వ్యాపారాలు జరిగే అవకాశాలున్నాయని అంచనా వేస్తున్నారు.

అందుబాటులో మొబైల్ అడ్వర్టైజ్ వాహనం



గత ఎన్నికల్లో రాజకీయ పార్టీల సమావేశాల కోసం మొబైల్ అడ్వర్టైజ్ వాహనం నూతనంగా నిర్మల్‌కు తీసుకు వచ్చాను. ప్రస్తుత శాసనసభ ఎన్నికల సందర్భంగా వాహనాన్ని సిద్ధం చేసి ఉంచాను. ఇప్పటికే ఆర్డర్లు కూడా వస్తున్నాయి.

– అయిట్ల ప్రవీణ్, రోషిని శ్రీ ఫోటో స్టూడియో

సౌండ్ సిస్టం ఏర్పాటు చేశాం



ఎన్నికల నేపథ్యంలో పెద్దపెద్ద సభల కోసం ప్రత్యేకంగా సౌండ్ సిస్టం ఏర్పాటు చేశాం. వివిధ రాజకీయా పార్టీల వారి నుంచి ఇప్పటికే ఆర్డర్లు మొదలవుతున్నాయి. మరో పది రోజుల్లో ఇంకా ఎక్కువగా ఆర్డర్లు వస్తాయని అనుకుంటున్నాను.

– వీరు, శివసాయి సౌండ్ సిస్టం నిర్వాహకుడు

ఫ్లెక్సీలకు గిరాకీ..



ఇప్పటికే అభ్యర్థులు, ఆయా పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు భారీగానే ఏర్పాటు చేసేందుకు ఆర్డర్లు వస్తున్నాయి. ఇటీవలే 17లక్షల విలువగల హైటెక్నికల్ మిషన్‌ను కొనుగోలు చేశాను. ప్రస్తుతం ఫ్లెక్సీలకు సంబంధించి గ్రామ, మండల స్థాయి నాయకుల నుంచి ఆర్డర్లు వస్తున్నాయి.

– అదప శ్రీధర్, ఐ ఫ్లెక్సీ నిర్వాహకుడు

గాయపడిన యువకుడి మృతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామ శివారులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఎస్సై నరేశ్‌కుమార్ కథనం ప్రకారం.. లక్సెట్టిపేట మండల మోదెల గ్రామానికి చెందిన కుశనపల్లి సాయికృష్ణ(26) మంచిర్యాలలోని రాయల్ ఎన్‌ఫీల్డ్ షోరూంలో మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ప్రతీ రోజూ ఉదయం మోదెల నుంచి మంచిర్యాలకు వచ్చి పని చేసుకుని తిరిగి ఇంటి వెళ్తు ఉండేవాడు. శనివారం రాత్రి బైక్‌పై ఇంటికి వెళ్తుండగా ముల్కల్ల గ్రామ శివారులో పుష్కర ఘాట్‌కు వెళ్లే రహదారి సమీపంలో లక్సెట్టిపేట నుంచి మంచిర్యాల వైపు వస్తున్న కారు సాయికృష్ణ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురయ్యాడు. స్థానికులు గమనించి 108కు సమాచారం అందించగా వెంటనే మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. తండ్రి చంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పదంగా పశువుల కాపరి మృతి


భీమేశ్ మృతదేహం

నెన్నెల: అనుమానాస్పదంగా పశువుల కాపరి చెరువులో పడి మృతి చెందిన విషాద సంఘటన ఆదివారం మండలంలోని నందులపల్లిలో చోటుచేసుకుంది. నెన్నెల ఎస్సై శ్యాంపటేల్ వివరాల ప్రకారం... నెన్నెల మండల కేంద్రంలోని పోశమ్మ వాడకు చెందిన పశువుల కాపరి జమిశెట్టి భీమేష్(53) ఉదయం పశువులను తీసుకొని నందులపల్లి తిమ్మయ్య చెరువు వైపు వెళ్లాడు. 10గంటల సమయంలో నీళ్లు తాగడానికి చెరువులోకి దిగి ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. గమనించిన తోటి పశువుల కాపరులు చూసి భీమేష్ భార్య సమ్మక్కకు ఫోన్ చేశారు. కొంత మంది యువకులు చెరువు వద్దకు చేరుకొని భీమేష్‌ను బయటకు తీశారు. అప్పటికే అతడు చనిపోయాడు. భర్త మరణంపై అనుమానాస్పదంగా ఉందని తోటి పశువుల కాపరులే ఏదో చేశారని మృతుడి భార్య సమ్మక్క పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

గుడుంబా పట్టివేత


పట్టుబడిన నిందితుడు

నెన్నెల: మండలంలోని జోగాపూర్ వద్ద ఆదివారం 40లీటర్ల గుడుంబాను పట్టుకున్నట్లు ఎస్సై శ్యాంపటేల్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... నార్వాయిపేటకు చెందిన భుక్య రవి మైలారం గ్రామంలో గుడుంబాను విక్రయించడానికి బైక్‌పై తరలిస్తుండగా జోగాపూర్ వద్ద పట్టుకొని స్వాధీనపర్చుకున్నారు. బైక్‌ను సీజ్ చేసి రవిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వాహనాల తనిఖీల్లో ఎస్పీ


తనిఖీలు చేస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని కాగజ్‌నగర్‌రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మైసమ్మ దేవాలయం వద్ద ఆదివారం జిల్లా ఎస్పీ సురేశ్‌కుమార్ వాహనాల తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. ఆధారాలు లేకుండా డబ్బులు తరలించొద్దని, ఎన్నికల నిబంధనలు పాటించాలని సూచించారు. ఆయన వెంట రూరల్ ఎస్సై సోనియా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్
- కాగజ్‌నగర్‌లో స్వేరోస్ ఆవిర్భావ వేడుకలు

జ్ఞాన సమాజ నిర్మాణమే స్వేరోస్ లక్ష్యం


మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్‌టౌన్: జ్ఞాన సమాజ నిర్మాణమే స్వేరోస్ లక్ష్యమని స్వేరోస్ వ్యవస్థాపకుడు, బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. దివంగత ఐఏఎస్ అధికారి ఎస్‌ఆర్ శంకరన్ జయంతి సందర్భంగా వినయ్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన స్వేరోస్ ఆవిర్భావ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజనులకు రాజ్యాధికారమే లక్ష్యంగా స్వేరోస్ ముందుకెళ్తుందన్నారు. భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతుందని ఆరోపించారు. సావిత్రీ బాయి పూలేను చదువుల తల్లిగా ఆరాధిస్తే కొన్ని మతతత్వ శక్తులు అంగీకరించడం లేదని మండిపడ్డారు. ఓటుహక్కుతో రాజ్యాధికారం సాధించాలని పిలుపునిచ్చారు. పేద విద్యార్థుల విద్యాభివృద్ధి, మహనీయుల ఆశయ సాధనకు స్వేరోస్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సావిత్రీ బాయి పూలే మనవరాలు నీతా రమా కాంత్ హోలే, భంతేజీ దమ్మ సారథి, సిరాజ్ రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

జైనథ్: మండలంలోని మేడిగూడ గ్రామంలోని బెల్ట్‌షాప్ నుంచి రూ.10 వేల విలువ చేసే మద్యం బాటిళ్లను సీసీఎస్ పోలీసులు సీజ్ చేశారు. శనివారం రాత్రి గ్రామంలోని బెల్ట్‌షాప్‌లో తనిఖీ చేపట్టగా, మద్యం బాటిళ్లు లభించినట్లు సీసీఎస్ ఎస్సై సాయినాథ్ తెలిపారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.